



# BNS BHARAT NEWS SPECTRUM

## ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్






సంపుటి - 01 సంచిక -90 తెలంగాణ ఆంధ్రప్రదేశ్ 08-04-2026 బుధవారం పేజీలు : 6

## ప్రభుత్వ పథకాలు చివరి ఇంటి వరకు చేరవలసిన

# బాధ్యత అధికారులదే



- ఏపీ సీఎం చంద్రబాబు.

- ☐పాఠ్యాంశాలు నవీకరణ
- ☐కాలేజీ విద్య రీ-ఓరియెంటేషన్
- ☐ఉచిత ఇళ్ల స్థలాల పంపిణీ వేగవంతం కావాలి
- ☐విద్యుత్ తీగల వల్ల ప్రమాదాలు జరగకూడదు
- ☐ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ☐అవేర్ 2.0 మొబైల్ యాప్ లాంఛ్ చేసిన ముఖ్యమంత్రి

**న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్):** అమరావతి బిఎన్ఎస్ ఏప్రిల్ 7:- ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న పథకాలు.. కార్యక్రమాలను పక్కా ప్రణాళికలతో అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంతోపాటు.. సంతృప్తి కలిగించే రీతిలో సేవలు అందించినప్పుడే మంచి ఫలితాలు వస్తాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే విషయంలో ఎలాంటి జాప్యమూ జరగకూడదని ముఖ్యమంత్రి ఆదేశించారు. మంగళవారం ఆర్టీజీస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఈ ఏడాదిలో మరోసారి సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించుకున్నాం. ఆ దిశగా గృహ నిర్మాణ శాఖ వేగంగా పనిచేయలి. టిడ్కో ఇళ్లు కాకుండానే మరో 5 లక్షలకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలి. ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసే విషయంలో ఎక్కడా ఆలస్యం కాకూడదు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇళ్ల నిర్మాణం చేపడుతున్నాం.. లబ్దిదారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఇది కొనసాగాలి. ఇళ్ల నిర్మాణంతోపాటు... ఇంటి స్థలాల పంపిణీ ప్రక్రియను వీలైనంత త్వరగా ప్రారంభించాలి. సుమారు 2 లక్షల మంది ఇళ్ల స్థలాలు కోరినట్టు సర్వేలో తేలింది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇళ్ల నిర్మాణాన్ని ఎంత వేగంగా చేపడుతున్నారో.. ఇళ్ల స్థలాల పంపిణీని కూడా అదే స్థాయిలో చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఇక వర్షాకాలంలో ఇసుక సరఫరాలో ఇబ్బందులు రాకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలకు ఇసుకను ఉచితంగా ఇస్తున్నాం. ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని వదులుకుంటున్నాం. రీచుల వద్ద, స్టాక్ యార్డుల వద్ద రవాణ పేరుతో కానీ... ఇతర పేర్లతో ఎక్కువ ఛార్జీలు వసూలు చేయడానికి వీల్లేదు. దీనిపై పటిష్ట నిఘా పెట్టాలి' అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

కాలేజ్ కరిక్యులంను రీ-స్ట్రక్చర్ చేయాలి

"కాలేజీ విద్యను మరింత పటిష్టంగా తీర్చిదిద్దాలి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కాలేజీ విద్యను రీ-ఓరియేంటేషన్ చేయాల్సి ఉంది. ఈ మేరకు అధ్యయనం చేయండి. యూనివర్సిటీలతో నిత్యం అనుసంధానం చేసుకోవాలి. ట్రెడిషన్ కోర్సులతో పాటు... డిమాండ్ ఉన్న కోర్సులను, కొత్త కరిక్యులంను ప్రవేశపెట్టేలా కసరత్తు చేయాలి. ఈ మేరకు కరికుల్యంను రీ-స్ట్రక్చర్ చేసేలా చూడాలి.

మిగతాది 2 లో

## కాంగ్రెస్ సర్కార్‌వి పిరికిపంద చర్యలు

### బీఆర్ఎస్ నేతల అరెస్టులపై ఆగ్రహం



**న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్):** కాంగ్రెస్ ప్రభుత్వం పిరికిపంద చర్యలకు దిగిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. పరిగి నియోజకవర్గంలో భూముల కోసం పోరాడుతున్న రైతులకు మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహ నిర్బంధం చేయడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన పేర్కొన్నారు.మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, అలాగే పలువురు నేతలను అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుందని కేటీఆర్ అన్నారు.

## ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో రాజ్ కేసిరెడ్డికి బెయిల్



**న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్):** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న రాజ్ కేసిరెడ్డికి రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది.గత ఏడాది ఏప్రిల్ 25న సిట్ అధికారులు అతన్ని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి జ్యుడీషియల్ కస్టడీలోనే కొనసాగుతున్నాడు.

## రేవంత్ రెడ్డికి కవిత కౌంటర్..

### కేరళ ప్రజలకు హెచ్చరిక



**న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్):** కేరళ ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరుకుంటున్న వేళ, ఎల్‌డీఎఫ్--యూడీఎఫ్ నేతల మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలో పాల్గొంటూ పినరయి విజయన్‌పై చేసిన వ్యాఖ్యలకు ప్రతిగా తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియోలో కవిత మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేసిందని ఆరోపించారు.

## కుక్కల దాడిలో చిరుత మృతి

### నీటి కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన వన్యప్రాణి!



## నా వ్యక్తిగత వీడియోలు తొలగించండి

### హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్



## మాజీ మంత్రి హరీశ్ రావు హౌస్ అరెస్ట్

### పరిగి పర్యటనకు బ్రేక్!



## ఏపీ ప్రయోజనాలు తెలంగాణకు తాకట్టు..!

### రేవంత్‌రెడ్డితో చంద్రబాబు చీకటి ఒప్పందం..



న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): తిరుపతి డీబీఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన రాయలసీమ ఎత్తిపోతల పథకం చర్చా గోష్టిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాయలసీమ అభివృద్ధిని విస్మరించడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాయలసీమకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ఎత్తిపోతల పథకానికి రూ.2 వేల కోట్లు ఖర్చు చేయలేని ప్రభుత్వం, అమరావతి పేరుతో రూ.2 లక్షల కోట్లు ఎలా ఖర్చు చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పటికే రెండేళ్లలో అమరావతికి రూ.8 వేల కోట్లు ఖర్చు చేశారని, అదే వేగంతో కొనసాగితే ప్రాజెక్ట్ పూర్తి కావడానికి 100 ఏళ్లకుపైగా పడుతుందని విమర్శించారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చీకటి ఒప్పందం చేసుకున్నారని సంచలన ఆరోపణలు చేశారు రోజా.. రాష్ట్ర ప్రయోజనాలను తెలంగాణకు తాకట్టు పెట్టారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రాయలసీమ పథకాన్ని నిలిపివేయడం అంటే ఈ ప్రాంత ప్రజల గొంతు కోయడమేఅన్నారు..87 శాతం పూర్తయిన ఎత్తిపోతల ప్రాజెక్టును వెంటనే పూర్తి చేస్తే రాయలసీమ సస్యశ్యామలం అవుతుందని.. ఈ అంశంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి పాదయాత్ర చేపట్టి మహా ఉద్యమంగా మార్చాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆర్కే రోజా..

## విజయన్ మరో మోదీలా వ్యవహరిస్తుండు

### సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు



## ఎయిరిండియాకు షాక్

### సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా!



## జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం




అమరావతి ,బిఎన్ఎస్ ఏప్రియల్ 7:'జలమే జీవం... జీవమే జల సంరక్షణకు మూలం అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. సాధారణ ప్రజలు ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపే చర్యలు నుంచి వాగులు, వంకలు, నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కాపాడుకునే వరకు ఈ చైతన్యం అందరిలో వెల్లివిరియాల'ని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. భూమి మీద మనిషికి అవసరం అయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉంది.. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల పరిధిలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వంపై ఒక రోజు వర్క్ షాపు కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవన్ లో గురువారం ఉదయం మొదలైంది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు.

అనంతరం పవన్ కళ్యాణ్ ప్రసంగిస్తూ "నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన విధానం మెరుగవడానికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారం. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా దేశంలో ముందు వరుసలో ఉండటానికి మనకు సమృద్ధిగా ఉన్న నీటి వనరులే కారణం. అలాంటి నీటిని సంరక్షించుకునే పెద్ద సవాల్ ఇప్పుడు మన ముందుంది. ఉపరితల జలాలను జాగ్రత్తగా కాపాడుకోవడం, రానురాను తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. భవిష్యత్తును సుందరంగా నిర్మించుకోవాలంటే ప్రతి నీటి చుక్క ఎంత విలువైందో తెలుసుకోవాలి.

## కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్

### తీసుకోవాలనుకునే వారికి షాక్



**న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్):** టూవీలర్, ఫోర్ వీలర్ వాహనం ఏదైనా నడపాలంటే డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. డ్రైవింగ్ వృత్తిని ఎంచుకునే వారు, వాహనాలు నడిపేవారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాల్సిందే. డ్రైవింగ్ లైసెన్స్ కావాలనుకునే వారు ఆర్టీఏలో దరఖాస్తు చేసుకుంటుంటారు. ఆ తర్వాత దరఖాస్తుదారులకు ఎల్ఎల్ఆర్ టెస్ట్, డ్రైవింగ్ స్కిల్ టెస్ట్ నిర్వహించి అర్హత సాధించిన వారికి శాశ్వత లైసెన్స్ జారీ చేస్తుంటారు.

## ఈనెల 15 తర్వాత ఆ ఖాతాలు క్లోజ్!



# జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం

మొదటి పేజీ తరువాయి

గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి సంరక్షణ చర్యలు, వృథా అయ్యే నీటిని కాపాడుకునే చర్యలను వేగవంతం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు మనం భరోసానిచ్చినట్లు అవుతుంది.

౨ గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు ఎన్నో అవరోధాలు

ప్రతి కుటుంబానికీ తగినంత తాగు నీరు అందించాలనే ఆశయానికి క్షేత్రస్థాయిలో ఎన్నో అవరోధాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తగినంతగా – ఉపరితలంలో లభించే నీరు లభ్యత లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం కీలకమైన సమస్యలుగా ఉన్నాయి. లభ్యతగా ఉన్న నీరు కూడా ఎక్కువగా కాలుష్యం బారిన పడుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరి శిఖర గ్రామాల్లో వేసవిలో నీటి సమస్యను తీర్చేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు వేస్తున్నాం. మారుతున్న సాంకేతికను ఎప్పటికప్పుడు వినియోగించుకొని నీటి కొరత తీర్చేందుకు, నీటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. ముఖ్యంగా నీటి సంరక్షణ చర్యల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం.

ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ , కాలుష్య నియంత్రణమండలి ఛైర్మన్ డా.పి కృష్ణయ్య , ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు , అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌వి పిరికిపంద చర్యలు బీఆర్ఎస్ నేతల అరెస్టులపై ఆగ్రహం

మొదటి పేజీ తరువాయి



అరెస్టులు, కేసులు తమకు కొత్త కాదని, తెలంగాణ ఉద్యమం నుంచే ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నామని గుర్తుచేశారు.

రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వారికి మద్దతు ఇస్తున్న విపక్ష నేతలను అడ్డుకోవడం తప్పు అని ఆయన మండిపడ్డారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములు సేకరించడాన్ని తక్షణమే నిలిపివేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రైతుల అనుమతి లేకుండా జరుగుతున్న ఈ చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, బాధితులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

# ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో రాజ్ కేసిరెడ్డికి బెయిల్

న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న రాజ్ కేసిరెడ్డికి రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది ఏప్రిల్ 25న సిట్ అధికారులు అతన్ని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి జ్యుడీషియల్ కస్టడీలోనే కొనసాగుతున్నాడు. దాదాపు ఏడాది కాలంగా జైల్లో ఉన్న రాజ్ కేసిరెడ్డికి ఈ బెయిల్ కొంత ఊరటనిచ్చింది. ఇప్పటికే పలుమార్లు బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు తిరస్కరించగా, తాజాగా మరోసారి విచారణ జరిపిన హైకోర్టు షరతులతో బెయిల్ మంజూరు చేసింది.

# రేవంత్ రెడ్డికి కవిత కౌంటర్.. కేరళ ప్రజలకు హెచ్చరిక

న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): కేరళ ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరుకుంటున్న వేళ, ఎల్‌డీఎఫ్‌--యూడీఎఫ్ నేతల మధ్య మాటల యుద్ధం మరింత వేడెక్కింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలో పాల్గొంటూ పినరయి విజయన్‌పై చేసిన వ్యాఖ్యలకు ప్రతిగా తెలంగాణ జాగృతి చీఫ్ కల్వకుంట్ల కవిత స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియోలో కవిత మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను నిలువునా మోసం చేసిందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన '6 గ్యారంటీలు' అమలు చేయకుండా ప్రజలను నిరాశపరిచిందని విమర్శించారు. రైతు రుణమాఫీ, ఉద్యోగాల కల్పన, రైతు సంక్షేమం వంటి ముఖ్య హామీలు ఇంకా నెరవేరలేదని పేర్కొన్నారు. ఇప్పుడు అదే హామీలతో రేవంత్ రెడ్డి కేరళలో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణలో జరిగినట్లే కేరళలో కూడా ప్రజలు మోసపోవద్దని హెచ్చరిస్తూ, అభివృద్ధి కొనసాగాలంటే పినరయి విజయన్ వంటి అనుభవజ్ఞులైన నాయకత్వాన్నే ఎంచుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రస్తావిస్తూ కేరళ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కవిత చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# కుక్కల దాడిలో చిరుత మృతి నీటి కోసం వచ్చి ప్రాణాలు కోల్పోయిన వన్యప్రాణి!

న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): నీటి కోసం వచ్చి కుక్కల దాడిలో చిరుత మృతి చెందింది. ఈ ఘటన కడప జిల్లాలోని చిన్నబాకరపురంలో చోటు చేసుకుంది. ఎండాకాలం కావడంతో వన్యప్రాణులు అడవిని వీడి జనావాసాల్లోకి రావడం ప్రాణాంతకంగా మారుతుంది. నీటి దాహాన్ని తీర్చుకునేందుకు అడవి నుంచి చిన్నబాకరపురం గ్రామానికి వచ్చిన ఒక చిరుతపులిపై స్థానిక ఊర కుక్కలు మూకుమ్మడిగా దాడి చేశాయి. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన చిరుత అక్కడికక్కడే మృతి చెందింది.

సాధారణంగా వేటలో క్రూరమృగమైన చిరుత, కుక్కల గుంపును ఎదుర్కోలేక ప్రాణాలు వదలడం స్థానికులను విస్మయానికి గురిచేసింది. చనిపోయిన చిరుతను చూసేందుకు గ్రామస్థులు భారీగా తరలివచ్చారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఎండ తీవ్రత వల్ల నీటి వనరులు ఎండిపోవడంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి వస్తున్నాయని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం.

# విజయన్ మరో మోదీలా వ్యవహరిస్తుండు సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): కేరళ సీఎం పినరయి విజయన్ కు రాసిన లేఖపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పినరయి విజయన్ ఎప్పుడు సిద్ధమన్నా తాను చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. మంగళవారం ఆయన తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పినరయి విజయన్‌కి రోల్ మోడల్స్ జ్యోతిబసు, సోమనాథ్ ఛటర్జీలా? లేక నరేంద్ర మోదీ, అమిత్ షానా? అని ప్రశ్నించారు. కానీ, ఆయన నరేంద్ర మోదీని తన రోల్ మోడల్‌గా భావిస్తున్నారని, ఆయన పద్ధతులు కేరళ ప్రజలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని విమర్శించారు. విజయన్ ఓ ముఖ్యమంత్రిలా కాకుండా, మరో నరేంద్ర మోదీ' తరహాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పినరయి విజయన్‌పై ఉన్న అవినీతి కేసుల నుంచి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆయనను రక్షిస్తోందని విమర్శించారు. అందుకే ఎన్ని ఆరోపణలు వచ్చినా ఆయనపై కేంద్ర సంస్థలు చర్యలు తీసుకోవడం లేదని రేవంత్ రెడ్డి కామెంట్ చేశారు. దేశ రాజకీయాల్లో ఇండియా కూటమి భాగస్వాముల మధ్య ఇటువంటి వాగ్వాదం చోటుచేసుకోవడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. కేరళలో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మధ్య ఉన్న రాజకీయ వైరం ఈ వ్యాఖ్యలతో మరోసారి బహిర్గతమైంది.

# మాజీ మంత్రి హరీశ్ రావు హౌస్ అరెస్ట్.. పరిగి పర్యటనకు బ్రేక్!

న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తున్న బాధితులను కలిసేందుకు ఆయన వెళ్లకుండా పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి, ఆయనను బయటకు రాకుండా అడ్డుకున్నారు.

నేతల అరెస్టులు – గృహ నిర్బంధాలు

కేవలం హరీశ్ రావు మాత్రమే కాకుండా, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు ఉమ్మడి రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలను కూడా పోలీసులు గృహ నిర్బంధం చేశారు. పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. ఇండస్ట్రియల్ పార్క్ పేరిట తమకు ఉన్న 1200 ఎకరాల సాగు భూములను రేవంత్ రెడ్డి ప్రభుత్వం బలవంతంగా లాక్కుంటోందని ఆరోపిస్తూ రైతులు గత కొన్ని రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షా శిబిరానికి సంఘీభావం తెలిపేందుకు వస్తున్న హరీశ్ రావు పర్యటనకు పోలీసులు అనుమతి నిరాకరించారు.

ప్రభుత్వ తీరుపై బీఆర్ఎస్ ఆగ్రహం

రైతుల పక్షాన నిలబడితే అరెస్టులు చేస్తారా అని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని హరీశ్ రావు విమర్శించారు. భూములు కోల్పోతున్న రైతుల ఆవేదనను వినే తీరిక ప్రభుత్వానికి లేకపోగా, వారిని పరామర్శించేందుకు వస్తున్న ప్రతిపక్ష నేతలను అడ్డుకోవడం దుర్మార్గమని ఆరోపించారు. ప్రస్తుతం పరిగి నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు.

# కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలనుకునే వారికి షాక్

మొదటి పేజీ తరువాయి

కానీ ఇకపై మరో టెస్ట్ కూడా పాస్ కావాల్సి ఉంటుంది. ఆ టెస్ట్ పాసైతేనే ఎల్ఎల్ఆర్ కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆర్టీఏ అధికారులు తెలిపారు. ఇక నుంచి ఈ రెండు టెస్టుల కంటే ముందు రోడ్ సేఫ్టీ టెస్ట్ పాస్ కావాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు.

డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నప్పటికీ కొందరు డ్రైవర్లు ప్రమాదాలకు కారణమవుతుంటారు. నైపుణ్యం లేక, ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన లేకపోవడం, రూల్స్ పాటించకపోవడం, రోడ్డు సేఫ్టీపై కూడా అవగాహన లేకపోవడం వల్ల ప్రమాదాలకు కారణమవుతుంటారు. ఇలాంటి ఘటనలకు చెక్ పెట్టేందుకు అధికారులు ట్రాఫిక్ నిబంధనలు తెలిసేలా లైసెన్సుల జారీకి ముందే రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించేందుకు టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ టెస్ట్ పాసైతే సర్టిఫైడ్ నంబర్ ఇస్తారు. ఈ నంబర్ ద్వారా లర్నింగ్ కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

కొత్తగా లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి స్లాట్ బుక్ చేసుకున్న రోజే ఆర్టీఏ ఆఫీసులో ట్రాఫిక్ రూల్స్ పై కంప్యూటర్‌లో పరీక్ష నిర్వహిస్తారు. అందులో పాస్ అయితే వెంటనే లెర్నింగ్ లైసెన్స్ జారీ చేస్తారు. దీని వ్యాలిడిటీ 6 నెలల వరకు ఉంటుంది. ఈలోపు పర్మినెంట్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. స్లాట్ బుక్ చేసుకున్న రోజు దరఖాస్తుదారు టూవీలర్ లేదా కారును టెస్ట్ ట్రాక్ పై నడపాల్సి ఉంటుంది. ఈ టెస్ట్ లో పాసైతేనే పర్మినెంట్ లైసెన్స్ జారీ చేస్తారు. రోడ్డు భద్రతా రూల్స్ తప్పనిసరిగా అమలు చేయాలని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో అధికారులు ఈ కొత్త రూల్ అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# నా వ్యక్తిగత వీడియోలు తొలగించండి హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యే అరవ శ్రీధర్

న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తన వ్యక్తిగత వీడియోలు, ఫోటోలపై జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. తన ప్రైవసీకి భంగం కలిగించేలా ఉన్న ఆ కంటెంట్‌ను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సామాజిక మాధ్యమాల్లో హర్షవీణ అనే మహిళతో ఎమ్మెల్యే ఉన్న ఫోటోలు, వీడియోలను కొందరు ఉద్దేశపూర్వకంగా వైరల్ చేస్తున్నారని తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అయిత అవి తన క్లయింట్ వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా ఉన్నాయని, తక్షణమే వాటిని అన్ని ప్లాట్‌ఫామ్‌ల నుంచి తొలగించేలా ఉత్తర్వులు జారీ చేయాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. కాగా, ఐదు రోజుల క్రితం గతంలో ఎమ్మెల్యేతో సన్నిహితంగా ఉన్న హర్షవీణ అనే మహిళపై తాతంశెట్టి నాగేంద్ర అనే వ్యక్తి దాడికి పాల్పడ్డారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాతంశెట్టి నాగేంద్రపై ఇప్పటికే పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ పరిణామాల మధ్య ఎమ్మెల్యేకు సంబంధించిన వీడియోలు బయటకు రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తన వ్యక్తిగత జీవితాన్ని అడ్డుపెట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుం వేచి చూడాల్సిందే మరి.


# ఈనెల 15 తర్వాత ఆ ఖాతాలు క్లోజ్!




న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): పంజాబ్ నేషనల్ బ్యాంక్ కస్టమర్లకు బిగ్ అలర్ట్. మూడు సంవత్సరాలుగా ఎలాంటి ట్రాన్సాక్షన్స్ జరపని ఖాతాలు, జీరో బ్యాలెన్స్ ఉన్న అకౌంట్లను క్లోజ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంది పంజాబ్ నేషనల్ బ్యాంక్. ఈ నెల 16వ తేదీ నుంచి ట్రాన్సాక్షన్ జరగని ఖాతాలను క్లోజ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

ఖాతాలు ఇనాక్టివ్ గా ఉండటం వల్ల మోసాలు జరిగే ప్రమాదం పొంచి ఉందని ఈ సందర్భంగా వెల్లడించింది. ఒకవేళ వినియోగదారులు తమ అకౌంట్లు కొనసాగించాలని కుంటే ఈ నెల 15వ తేదీలోపు కేవైసీ అప్డేట్ చేసుకోవాలని సూచనలు చేసింది. దాంతో పాటు మనీ ట్రాన్జక్షన్స్ కూడా రెగ్యులర్ గా చేయాలని కోరింది. లేకపోతే ఖాతాలు మాత్రం క్లోజ్ చేయడం పక్కా అని వెల్లడించింది.

# అన్నమయ్య జిల్లాలో జూనియర్ లాయర్ దారుణహత్య




న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): రాష్ట్రంలో క్రైం రేటు రోజురోజుకూ పెరుగుతోంది. వివాహేతర సంబంధాలు, భూ వివాదాలు, పర్సనల్ పగలు ఇలా రకరకాల కారణాలతో ప్రతిరోజూ దారుణమైన హత్యోదంతాలు వెలుగుచూస్తున్నాయి. తాజాగా అన్నమయ్య జిల్లాలో ఓ యువ న్యాయవాది హత్యకు గురయ్యారు. పీలేరు నియోజకవర్గం కేవీ పల్లి మండలం వడ్డిపల్లికి చెందిన న్యాయవాది ఎల్లయ్యను సోమవారం రాత్రి దారిదోపిడీ ముఠా దారుణంగా హతమార్చింది. తన ఇంటివద్ద ఉన్న ఎల్లయ్యను రాళ్లతో కొట్టి చంపారు.

గతంలో వడ్డిపల్లి గ్రామంలో కొందరు యువకులు ముఠాగా ఏర్పడి దారిదోపిడీలకు పాల్పడేవారు. ఈ కేసులో ఎల్లయ్య పోలీసులకు వారిగురించి సమాచారమిచ్చి పట్టించారు. అప్పటి నుంచి ఎల్లయ్యపై ఆ ముఠా కక్షగట్టింది. చంపేస్తామని బెదిరించగా.. ప్రాణభయంతో ఎల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత తుపాకీ లైసెన్సు కోసం అప్లై చేసుకున్నారు. ఈలోగానే దోపిడీ ముఠా ఎల్లయ్యపై దాడి చేసి దారుణంగా చంపేసింది.

# మహిళా ఉద్యోగినిపై అత్యాచారం కేసు పోలీసుల రహస్య విచారణ




న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): పల్నాడు జిల్లా మాచర్లలో సంచలనం సృష్టించిన ప్రభుత్వ మహిళా ఉద్యోగిని అత్యాచారం కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని రాజుపాలెంకు చెందిన శ్రీనివాస్‌గా పోలీసులు గుర్తించారు. ఘటన జరిగిన ప్రాంతంలోని సీసీటీవీ కెమెరాలను పరిశీలించిన పోలీసులు, అందులోని ఫుటేజీ ఆధారంగా నిందితుడి కదలికలను ట్రాక్ చేశారు. దీని ద్వారానే శ్రీనివాస్‌ను గుర్తించి, రహస్యంగా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ దారుణానికి అతడు ఒంటరిగా పాల్పడ్డాడా లేదా మరెవరైనా సహకరించారా అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. గత గురువారం మాచర్లలో ఒంటరిగా నివసిస్తున్న ప్రభుత్వ మహిళా ఉద్యోగిని ఇంట్లోకి, మంచి నీళ్ల నెపంతో నిందితుడు ప్రవేశించాడు. కత్తితో బెదిరించి, ఆమె కాళ్లు, చేతులు కట్టేసి అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ప్రస్తుతం బాధితురాలు గుంటూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

ప్రభుత్వం, పోలీసుల స్పందన..

ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్రంగా స్పందించారు. నిందితుడిని వెంటనే పట్టుకుని, కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, క్లూస్ టీమ్స్ సేకరించిన ఆధారాలతో పోలీసులు కేసును ఛేదించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని, బాధితురాలికి న్యాయం చేయాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఎయిరిండియాకు షాక్ సీఈవో క్యాంప్‌బెల్ విల్సన్ రాజీనామా!

న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): ప్రముఖ ప్రఖ్యాత విమానయాన సంస్థ ఎయిరిండియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ సంస్థ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. టాటా గ్రూప్ ఎయిర్ ఇండియాను దక్కించుకున్న తర్వాత సంస్థను గాడిలో పెట్టడంలో కీలక పాత్ర పోషించిన విల్సన్, తన ఐదేళ్ల పదవీ కాలం ముగియక ముందే తప్పుకోవడం విమానయాన రంగంలో చర్చనీయాంశంగా మారింది. అయితే, విల్సన్ రాజీనామా చేసినప్పటికీ, కొత్త సీఈవో బాధ్యతలు స్వీకరించే వరకు విల్సన్ తన విధుల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు సెప్టెంబర్ 2026 వరకు ఆయన నోటీసు పీరియడ్‌లో ఉండే అవకాశం ఉంది.

కాగా, 2022లో బాధ్యతలు చేపట్టిన విల్సన్ పదవీ కాలం జూలై 2027 వరకు ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఏడాదిన్నర ముందే ఆయన తప్పుకుంటున్నట్లుగా సమాచారం. ఎయిరిండియా బోర్డు ఇప్పటికే ఆయన రాజీనామాను ఆమోదించింది. ఎయిరిండియాను ఆధునీకరించడానికి ఆయన 'విహాన్.ఏఐ' అనే ఐదేళ్ల ప్రణాళికను ప్రవేశపెట్టారు. సుమారు 470 కొత్త విమానాల కోసం చారిత్రాత్మక ఒప్పందాలు కుదుర్చుకోవడంలోనూ, విస్తారా విలీన ప్రక్రియలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. రాజీనామాకు అధికారికంగా వ్యక్తిగత కారణాలు అని చెబుతున్నప్పటికీ, గత ఏడాది అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం, సంస్థ ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందుల నేపథ్యంలో బోర్డు కొత్త నాయకత్వం కోసం చూస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. టాటా గ్రూప్ ఇప్పటికే కొత్త సీఈవో కోసం వెతుకులాట ప్రారంభించినట్లుగా తెలుస్తోంది.

# ప్రభుత్వ పథకాలు చివరి ఇంటి వరకు చేరవలసిన బాధ్యత అధికారులదే.

అలాగే యూనివర్శిటీల ర్యాంకింగులు కూడా మరింతగా పెరగాల్సి ఉంది. విశాఖలోని ఆంధ్రా యూనివర్శిటీతోపాటు... మిగిలిన యూనివర్శిటీలు కూడా ర్యాంకింగులను మరింతగా పెంచుకోవాల్సి ఉంది. ఇదే సందర్భంగా హయ్యర్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ కూడా మరింత యాక్టివ్‌గా ఉండాలి. ఈ మేరకు విద్యా శాఖ అధికారులు కృషి చేయాలి. మధ్యాహ్న భోజన పథకం విషయంలో ఎలాంటి ఫిర్యాదులు కానీ... విమర్శలు కానీ రాకూడదు. శాప్ విభాగం తన యాక్టివిటీని మరింత పెంచుకోవాలి. 5కే రన్ వంటి కార్యక్రమాలు చేపట్టాలి. ప్రజల్లో, యువతలో ఆరోగ్య రక్షణ పట్ల అవగాహన కల్పించేలా శాప్ చర్యలు చేపట్టేలా శాప్ చర్యలు తీసుకోవాలి. రోడ్డు ప్రమాదాలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలి. ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రిపుల్ రైడింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు.. మరణాలు జరుగుతున్నాయి. ఇలాంటి వాటిని నివారించాలి. కఠినంగా నిబంధనలు అమలు చేయడానికంటే ముందు... ప్రజలను ఎడ్యుకేట్ చేయాలి. హెల్మెట్ వల్ల ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ట్రాఫిక్ నిబంధనలు తమ కోసమేననేది ప్రజలు అర్థం చేసుకునేలా అవగాహన కల్పించాలి. విద్యుత్, కేబుల్ తీగలు కిందకు వేలాడుతున్న కారణంగా అగ్ని ప్రమాదాలు జరిగి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటివి ఇకపై జరగడానికి వీల్లేదు' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# 3 రాష్ట్రాల్లో ముగిసిన ప్రచారం.. ఎల్లుండే పోలింగ్



న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): కేరళం, పుదుచ్చేరి, అస్సాంలో ఎన్నికల ప్రచారానికి తెరపడింది. మంగళవారం సాయంత్రం 5 గంటలకు మైకులన్నీ మూగబోయాయి. చివరి రోజున మాత్రం అన్ని పార్టీలు హోరా–హోరీగా ప్రచారం నిర్వహించాయి. ఈ మూడు రాష్ట్రాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది.ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. తొలి విడతలో కేరళం, పుదుచ్చేరి, అస్సాంలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరుగుతుండగా.. తమిళనాడులో ఏప్రిల్ 23న జరగనున్నాయి ఇక పశ్చిమ బెంగాల్‌లో అయితే రెండు విడతలుగా ఓటింగ్ జరుగుతోంది. తొలి విడత ఏప్రిల్ 23న జరుగుతుండగా.. రెండో విడత పోలింగ్ మాత్రం ఏప్రిల్ 29న జరుగుతోంది. ఇక ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు మాత్రం మే 4న విడుదలకానున్నాయి. ఇక ఎగ్జిట్ పోల్స్ మాత్రం ఏప్రిల్ 29న సాయంత్రం 6 గంటలకు వెలువడనున్నాయి. అన్ని పార్టీలు నువ్వానేనా? అన్నట్టుగా ఫైటింగ్ చేస్తున్నాయి.

# విలువలతో నడిచే నాయకత్వం... నమ్మకంతో కూడిన ప్రయాణం

## మెసారా ఇన్‌ఫ్రా వెంట ప్లాట్ యజమానులు

మెసారా ఇన్‌ఫ్రా అధినేత మారెళ్ల పెంచల సుబ్బారెడ్డి విద్యావేత్త గా అందరికీ చిరపరిచితం. దాదాపు మూడు దశాబ్దాల పాటు విద్యారంగంలో సేవలందిస్తూ, వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దిన వ్యక్తిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. గురువుగా, మార్గదర్శిగా ఆయన అందించిన దిశ అనేక కుటుంబాలకు స్థిరమైన భవిష్యత్తును అందించింది. విద్యార్థులలో విలువలను నాటడం, క్రమశిక్షణను పెంపొందించడం ఆయన సేవల ముఖ్య లక్షణాలు.

విద్యా రంగంలో చూపిన ఈ నిబద్ధత, క్రమశిక్షణ ఆయన వ్యక్తిత్వానికి బలమైన పునాది అయ్యాయి. అదే విలువలను ఆయన రియల్ ఎస్టేట్, ఇన్‌ఫ్రా రంగంలోనూ కొనసాగిస్తున్నారు. వ్యాపారంలో లాభాలకంటే నైతికత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ఆయన ప్రత్యేకమైన మార్గాన్ని ఎంచుకున్నారు. “వ్యాపారం కూడా విలువలతోనే సాగాలి” అన్న సూత్రాన్ని ఆచరణలో పెట్టడం ఆయన నాయకత్వానికి ప్రత్యేకతగా నిలుస్తోంది.

మెసారా ఇన్‌ఫ్రా సంస్థ కార్యకలాపాల్లో ఈ విలువలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రతి లావాదేవీ చట్టబద్ధంగా ఉండేలా చూసే విధానం, కస్టమర్ల ప్రయోజనాలను కాపాడే దృక్పథం సంస్థను విశ్వసనీయంగా నిలబెట్టాయి. కస్టమర్లతో నమ్మక సంబంధాన్ని ఏర్పరచడం, పారదర్శకతతో వ్యవహరించడం వల్ల సంస్థకు మంచి పేరు వచ్చింది.

ఈ నేపథ్యంలోనే ప్లాట్ యజమానుల్లో సుబ్బారెడ్డి నాయకత్వంపై విశేషమైన నమ్మకం ఏర్పడింది. విద్యావేత్తగా ఆయన చూపిన నిబద్ధత, విలువలు వ్యాపార రంగంలో కూడా కొనసాగుతాయని వారు విశ్వసిస్తున్నారు. “మా సమస్యలను అర్థం చేసుకుని, చట్టబద్ధంగా పరిష్కారం చూపగల నాయకత్వం ఇదే” అన్న భావనతో అనేక మంది ప్లాట్ యజమానులు ఆయనతో కలిసి నడవాలని నిర్ణయిస్తున్నారు. ఈ విశ్వాసమే ఇప్పుడు ఒక సమిష్టి శక్తిగా మారుతోంది.

MESARA
Infra Developers Limited

మెసారా ఇన్‌ఫ్రా వెంట నడవడం ద్వారా తమ హక్కులను సాధించగలమన్న నమ్మకం ప్లాట్ యజమానుల్లో బలపడుతోంది. వ్యక్తిగతంగా ఎదుర్కొన్న సమస్యలను సమిష్టిగా పరిష్కరించుకోవాలన్న ఆలోచనతో వారు ఒకే వేదికపైకి చేరుతున్నారు. ఈ ఐక్యతకు కేంద్రంగా సుబ్బారెడ్డి నాయకత్వం నిలవడం ఈ పరిణామానికి ప్రత్యేకతను తెచ్చింది.

కొల్లూరు భూముల నేపథ్యం -- చట్టబద్ధతకు బలమైన పునాది

కొల్లూరు ప్రాంతంలో 1984లో భూములు అధికారికంగా ప్లాట్లుగా విభజించబడ్డాయి. అప్పటి చట్టపరమైన విధానాల ప్రకారం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యి, వేలాది మంది కొనుగోలు దారులు తమ పేర్లపై హక్కులను నమోదు చేసుకున్నారు. ఈ లావాదేవీలు పూర్తిగా చట్టబద్ధమైనవేనని యజమానులు చెబుతున్నారు.

కాలక్రమేణా ఈ ప్లాట్లు పలుమార్లు చేతులు మారినా, ప్రతి సారి చట్టబద్ధ విధానాలను అనుసరించడం జరిగింది. అందువల్ల ప్రస్తుతం ఉన్న ప్లాట్ యజమానులకే అసలైన యాజమాన్య హక్కులు ఉన్నాయని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ చట్టబద్ధతే ఇప్పుడు వారి పోరాటానికి ప్రధాన ఆధారంగా మారింది.

అభివృద్ధి వేగం -- వివాదాలకు కారణమైన మార్పులు

2002లో అవుటర్ రింగ్ రోడ్ ప్రతిపాదన వెలువడిన తరువాత కొల్లూరు ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందింది. భూముల విలువలు పెరగడంతో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు విస్తరించాయి.

అయితే ఈ అభివృద్ధి మధ్య కొన్ని వివాదాస్పద లావాదేవీలు చోటుచేసుకున్నాయని యజమానులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ప్లాట్లుగా ఉన్న భూములను ఎకరాలుగా చూపిస్తూ విక్రయాలు జరగడం వల్ల అసలు యజమానుల హక్కులు ప్రభావితమయ్యాయి. ఈ పరిణామాలు సమస్యను మరింత క్లిష్టంగా మార్చాయి.

న్యాయపరమైన దిశ -- యజమానులకు కొత్త ఆశలు

కొల్లూరు భూముల వివాదం న్యాయపరమైన దిశలోకి వెళ్లిన తరువాత పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా చట్టబద్ధ రిజిస్ట్రేషన్ లావాదేవీల ప్రాముఖ్యత మరోసారి స్పష్టమైంది. ఇది ప్లాట్ యజమానుల వాదనకు బలాన్ని చేకూర్చింది.

ఈ పరిణామాల తరువాత యజమానుల్లో నమ్మకం పెరిగింది. తమ హక్కులు చట్టబద్ధమైనవేనన్న విశ్వాసంతో వారు మరింత సంఘటితంగా ముందుకు సాగుతున్నారు. న్యాయబద్ధతే సమస్య పరిష్కారానికి మార్గమని వారు భావిస్తున్నారు.

మెసారా ఇన్‌ఫ్రా -- ఐక్యతకు కేంద్రబిందువు

ప్రస్తుతం కొల్లూరు అంశంలో మెసారా ఇన్‌ఫ్రా ఒక కీలక వేదికగా మారింది. చట్టబద్ధత, పారదర్శకతతో వ్యవహరిస్తున్న సంస్థగా దీనిపై ప్లాట్ యజమానులు విశ్వాసం ఉంచుతున్నారు.

తమ సమస్యలను అర్థం చేసుకుని సరైన మార్గంలో పరిష్కారం చూపగల సంస్థ ఇదేనన్న భావన బలపడుతోంది. ఈ కారణంగా యజమానులు పెద్ద సంఖ్యలో మెసారా ఇన్‌ఫ్రా వెంట నడవాలని నిర్ణయిస్తున్నారు.

ఐక్యతగా మారుతున్న ఉద్యమం

కొల్లూరు ప్లాట్ యజమానులు ఇప్పుడు ఒక సమిష్టి శక్తిగా మారుతున్నారు. వ్యక్తిగతంగా పోరాడటానికి బదులుగా, ఐక్యంగా ముందుకు సాగితేనే విజయం సాధ్యమని వారు భావిస్తున్నారు.

మెసారా ఇన్‌ఫ్రాతో కలిసి నడవడం ద్వారానే తమ హక్కులను సాధించగలమన్న నమ్మకం వారిలో బలపడింది. ఈ ఐక్యతే ఇప్పుడు కొల్లూరు అంశంలో కీలక మలుపు తీసుకువస్తోంది.

ముగింపు -- విలువలతో నడిచే విశ్వాస ఉద్యమం

మొత్తం మీద, కొల్లూరు భూముల వ్యవహారం ఇప్పుడు ఒక కీలక దశలో ఉంది. విద్యావేత్తగా, విలువలకు కట్టుబడి ఉన్న నాయకుడిగా నిలిచిన సుబ్బారెడ్డి నాయకత్వంపై ఉన్న విశ్వాసం ప్లాట్ యజమానులను ఒకే దిశగా నడిపిస్తోంది.

మెసారా ఇన్‌ఫ్రా పారదర్శక విధానం, యజమానుల ఐక్యత, చట్టబద్ధతపై నిలిచిన పోరాటం -- ఇవన్నీ కలిసి సమస్య పరిష్కారానికి దారి చూపుతున్నాయి. ఈ విశ్వాసం మరింత బలపడుతున్న కొద్దీ, కొల్లూరు అంశం త్వరలోనే స్పష్టమైన ఫలితాలను అందుకుంటుందనే ఆశలు వ్యక్తమవుతున్నాయి.

# కాంగ్రెస్ కు కొత్త ఆశాకిరణం రేవంత్

కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే ఒక పేరు మార్మోగుతోంది.. అది ‘ఎనుముల రేవంత్ రెడ్డి’. తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొద్ది కాలంలోనే తనదైన ముద్ర వేసుకున్న రేవంత్, ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకగా నిలుస్తున్నారు. ముఖ్యంగా కేరళ అసెంబ్లీ ఎన్నికల వేళ ఏఐసీసీ ఆయనకు అప్పగించిన బాధ్యతలు, అక్కడ ఆయన నిర్వహిస్తున్న ప్రచార పర్వం చూస్తుంటే, రేవంత్ రెడ్డి కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాకుండా దేశవ్యాప్త ఆశాకిరణంగా ఎదుగుతున్నారని స్పష్టమవుతోంది.

హైకమాండ్ వ్యూహం.. రేవంత్ అమ్ములపొదిలో అస్త్రం!

కాంగ్రెస్ అధిష్టానం కేరళ ఎన్నికల బాధ్యతను రేవంత్ రెడ్డికి అప్పగించడం వెనుక ఒక బలమైన వ్యూహం ఉంది. తెలంగాణలో దశాబ్ద కాలం పాటు పాతుకుపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించిన రేవంత్ రెడ్డి ‘వ్యూహరచన’ కేరళలో కూడా పనిచేస్తుందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే బలంగా నమ్మారు. అందుకే, అత్యంత సంక్లిష్టమైన నియోజకవర్గాల్లో ప్రచారం చేసే బాధ్యతను ఆయన భుజాన వేశారు. రేవంత్ కూడా వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా, కేరళ వీధుల్లో కాంగ్రెస్ జెండాను రెపరెపలాడిస్తున్నారు.

వాయనాడ్‌లో జన సునామీ.. రాహుల్‌కు అండగా రేవంత్!

రాహుల్ గాంధీ సొంత నియోజకవర్గమైన వాయనాడ్‌లో రేవంత్ రెడ్డి అడుగు పెట్టగానే అక్కడి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. రాహుల్ గాంధీకి అత్యంత నమ్మకస్తుడైన సోదరుడిగా రేవంత్ అక్కడి ప్రజల్లో కలిసిపోయారు. “రాహుల్ గాంధీ దేశ ప్రధాని కావడమే కేరళ అభివృద్ధికి అసలైన పరిష్కారం” అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు వాయనాడ్ ఓటర్లలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. రేవంత్ రోడ్ షోలకు కిలోమీటర్ల మేర జనం బారులు తీరడం ఆయన జనాకర్షణకు నిదర్శనంగా నిలుస్తోంది.

మలయాళం డైలాగ్‌తో ‘విజయన్’పై విసుర్లు!

ప్రచారంలో రేవంత్ రెడ్డి తన వాగ్ధాటికి సినీ గ్లామర్‌ను కూడా జోడించి ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. తిరువనంతపురం జిల్లా నెమమ్ నియోజకవర్గంలో జరిగిన భారీ బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మలయాళీ సూపర్ స్టార్ మోహన్ లాల్ నటించిన ‘లూసిఫర్’ సినిమాలోని ఫేమస్ డైలాగ్‌ను ఉటంకిస్తూ.. కేరళ సీఎం పినరయి విజయన్‌ను ఉద్దేశించి “నీ పో మోనే విజయ్” (నీ పని అయిపోయింది విజయా.. ఇక వెళ్ళు) అంటూ ఎద్దేవా చేశారు. ఈ ఒక్క డైలాగ్ కేరళ రాజకీయాల్లో సంచలనం సృష్టించడమే కాకుండా యువతను విపరీతంగా ఆకర్షించింది.

బీజేపీ – సీపీఎం ‘అపవిత్ర కలయిక’పై ధ్వజం!

తన ప్రసంగాల్లో రేవంత్ రెడ్డి ప్రధానంగా బీజేపీ మరియు సీపీఎం మధ్య ఉన్న రహస్య ఒప్పందాన్ని ఎండగడుతున్నారు. “మోదీ మరియు విజయన్ ఇద్దరూ ఒకే నాణేనికి ఉన్న రెండు పార్శ్వాలు” అని ఆయన అభివర్ణించారు. ఢిల్లీలో మోదీ, కేరళలో విజయన్ కలిసి నాటకమాడుతున్నారని, ఒకరి అవినీతిని మరొకరు కప్పిపుచ్చుకుంటున్నారని రేవంత్ చేసిన విమర్శలు ఓటర్లను ఆలోచింపజేస్తున్నాయి. కేంద్రం నుండి వచ్చే నిధులను విజయన్ ప్రభుత్వం దారి మళ్లిస్తోందని ఆయన ఆధారాలతో సహా నిలదీశారు.

తెలంగాణ ‘ఆరు గ్యారెంటీలు’.. కేరళకు భరోసా!

రేవంత్ రెడ్డి కేరళ ప్రజలకు తెలంగాణలో తాము సాధించిన విజయాలను కళ్లకు కట్టినట్లు వివరిస్తున్నారు. “తెలంగాణలో మేము అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ?500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేశాం. సోనియా గాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం” అని ఆయన గర్వంగా చెబుతున్నారు. తెలంగాణలో సాధ్యమైన సంక్షేమం కేరళలో కూడా సాధ్యమని, అందుకు కాంగ్రెస్ గెలవాలని ఆయన పిలుపునిచ్చారు.

యువతలో జోష్.. సోషల్ మీడియాలో వైరల్!

రేవంత్ రెడ్డి వేదికపై ప్రసంగిస్తున్నప్పుడు ఆయన బాడీ లాంగ్వేజ్, దూకుడు స్వభావం కేరళ యువతను కట్టిపడేస్తున్నాయి. ఆయన ప్రసంగాలకు సంబంధించిన వీడియోలు మలయాళ అనువాదంతో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రేవంత్ రెడ్డిని చూడటానికి జనం ఎగబడుతుండటం గమనార్హం. కేరళలో ఎన్నడూ లేని విధంగా ఒక పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రికి ఇంతటి ఆదరణ లభించడం ఇదే మొదటిసారి అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



కార్యకర్తల్లో నూతనోత్తేజం.. గెలుపుపై ధీమా!

కేరళలోని కాంగ్రెస్ కార్యకర్తలు రేవంత్ రాకతో కొత్త ఊపిరి పోసుకున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని ఎలా పరుగులు పెట్టించాలో రేవంత్ రెడ్డి వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. బూత్ లెవల్ నుండి ప్రచారాన్ని ఉధృతం చేయాలని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని ఆయన కేడర్‌కు సూచించారు. రేవంత్ రెడ్డి అందించిన ‘విక్టరీ మంత్రం’తో కేరళలో యూడీఎఫ్ ఘనవిజయం సాధించడం ఖాయమని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

దక్షిణాది గొంతుకగా రేవంత్ ఎదుగుదల!

జాతీయ స్థాయిలో దక్షిణాది రాష్ట్రాల గొంతుకను బలంగా వినిపించగల నాయకుడిగా రేవంత్ రెడ్డి ఎదుగుతున్నారు. అటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఇటు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జోడీ ఇప్పుడు దక్షిణాదిలో కాంగ్రెస్ కోటను పటిష్టం చేస్తోంది. బీజేపీ సాగిస్తున్న విద్వేష రాజకీయాలకు రేవంత్ రెడ్డి తనదైన శైలిలో కౌంటర్ ఇస్తుండటం హైకమాండ్‌కు కొండంత అండగా మారింది. ఢిల్లీ పీఠాన్ని కదిలించే సత్తా ఉన్న నేతగా రేవంత్ పేరు ఇప్పుడు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది.

కాంగ్రెస్ పార్టీ ‘ట్రబుల్ షూటర్’!

క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న పార్టీని గట్టెక్కించడంలో రేవంత్ రెడ్డి ఒక ‘ట్రబుల్ షూటర్’గా మారుతున్నారు. ఎన్నికలు ఎక్కడ జరిగినా అక్కడ రేవంత్ ప్రచారం ఉంటే విజయం ఖాయమనే నమ్మకం పార్టీలో ఏర్పడింది. కేరళ తర్వాత ఇతర రాష్ట్రాల్లో కూడా ఆయన సేవలను ఉపయోగించుకోవాలని అధిష్టానం భావిస్తోంది. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో రేవంత్ రెడ్డి చూపిస్తున్న చొరవ ఆయనను జాతీయ రాజకీయాల్లో భవిష్యత్తులో కీలక మలుపులకు దారితీసే అవకాశం ఉంది.

ముగింపు: రేవంత్ రెడ్డి – ఒక నవశకం!

తెలంగాణ ముఖ్యమంత్రిగా రాష్ట్ర సంక్షేమాన్ని పర్యవేక్షిస్తూనే, మరోవైపు జాతీయ స్థాయిలో పార్టీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి అరుదైన నేత. మాటల్లో పదును, చేతల్లో వేగం వెరసి రేవంత్ రెడ్డి ప్రస్థానం ఇప్పుడు కేరళ నుంచి ఢిల్లీ దాకా పాకుతోంది. కేరళ ఎన్నికల ఫలితాలు రేవంత్ రెడ్డి పొలిటికల్ ఇమేజ్‌ను మరింత శిఖరాగ్రానికి తీసుకెళ్లడం ఖాయం. నిస్సందేహంగా, భారత రాజకీయాల్లో రేవంత్ రెడ్డి ఒక నవశకానికి నాంది పలుకుతున్నారు.

– యలమంచిలి విశ్వనాథన్

# కడపలో డ్రగ్స్,గంజాయి మూకలను అరికట్టండి..




కడపజిల్లా(బిఎన్ఎస్)ఏప్రిల్07: జిల్లాలో డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలను అరికట్టాలని, అలాగే వాటిని వాడే వారిపైన ఖటిని చర్యలు చేపట్టాలని,గంజాయి మూకల నుండి ప్రజలకు రక్షణ కల్పించి పోలీసులు నిరంతర పర్యవేక్షణ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు జమ్మలమడుగు స్థానిక ఎన్జీవో కార్యాలయం నందు విలేఖరుల సమావేశ నిర్వహణలో భాగంగా శివకుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో,జిల్లాలో రోజు, రోజుకు గంజాయి మూకల దాడులు,హత్యలు పెట్రేగి పోతున్నాయఅన్నారు.ఒకవైపు ప్రభుత్వం,పోలీసు యంత్రాంగం గంజాయి,డ్రగ్స్ పదార్థాలను వాడే వారిపై కటినంగా ఉంటామని వాటిని కూకటివేళ్లతో తీసివేస్తామని మాటల వరకే పరిమితం అవుతున్నారు తప్ప ఆచరణలో సాధ్యం కావడం లేదన్నారు.నెల్లూరులో పెంచలయ్య హత్య సంచలనం మరువక ముందే ఆసుపత్రి ఆవరణలోనే సోమవారం నాడు కడపలో గంజాయి బ్యాచ్ హత్య చేశారంటే ఏ స్థాయిలో ఉన్నారో అర్థమవుతుందన్నారు.

# రైతుల్లో ల్యాండ్ టైటలింగ్ యాక్టు ప్రకంపనలు



ఆనందపురం, ఏప్రిల్ 7: క్యూఆర్ కోడ్ స్కానింగ్ తో హద్దులు సహా మొత్తం భూమి వివరాలు తెలిపే పాస్ బుక్ ను రాజముద్రతో ప్రభుత్వం అందిస్తుందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీలో మంగళవారం నవీకరించిన పట్టాదార్ పాస్ పుస్తకాలు ఆయన రైతులకు పంపిణీ చేశారు. పొరపాట్లు లేని పాస్ పుస్తకాలను ఆయా భూ యజమానులకు ప్రతి నెల అందిస్తున్నామన్నారు. వైసీపీ హయంలో జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసిందని పేర్కొన్నారు. పట్టాదార్ పాస్ బుక్ లు, సర్వే రాళ్ల పై ఫోటోల కోసం జగన్మోహన్ రెడ్డి రూ. 700 కోట్ల వృధా ఖర్చు చేశారని, ఆ సొమ్ముతో 2 మెడికల్ కాలేజీలు, 10 హైస్కూల్స్ నిర్మించవచ్చని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూమి పత్రాలంటే రైతులకు సెంటిమెంట్ అని, జగన్ వారి భావోద్వేగాలతో పరిహాసమాడారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టే నాటికి రూ. 10 లక్షల కోట్ల అప్పు ఉందని, ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అనుభవజ్ఞుడైన నాయకుడు ముఖ్యమంత్రిగా ఉండడం వల్ల ఆలస్యం కాకుండా జీతాలివ్వడం సహా రూ. వేల కోట్లతో అభివృద్ధి పనులు చేసుకుంటున్నామని వెల్లడించారు. బోని, ముచ్చర్ల, శిర్లపాలెం తదితర గ్రామాల్లో ఇనాం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# రాపూరు కమ్యూనీటి సెంటర్ ని సందర్శించిన డి.యం.హెచ్. ఓ



నెల్లూరు జిల్లా రాపూరు(బి.యన్.యస్):– వందరోజుల క్షయవ్యాధి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం సందర్భంగా నెల్లూరు కుష్ఠ మరియు క్షయ వ్యాధి నియంత్రణ అధికారి అదనపు డి.యం.హెచ్.ఓ.డాక్టర్ ఖాదర్ వలి మంగళవారం రాపూరు కమ్యూనిటి హెల్త్ సెంటర్ ను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన క్షయ వ్యాధి కి సంబంధించి అన్ని రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి సుపెరడెంట్ డాక్టర్ అర్షియా తో కార్యక్రమం అమలు మరియు విధానం గురించి చర్చించారు. ఈ క్షయ వ్యాధి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా క్షయ వ్యాధి నిర్మూలన లక్ష్యాన్ని సాధించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని కోరారు.

# మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ తో పాలనలో విప్లవాత్మక మార్పులు




అమరావతి,ఏప్రియల్ 7(బిఎన్ఎస్): రాష్ట్రాన్ని డిజిటల్ భద్రతలో అగ్రగామిగా నిలపాలనే దూరదృష్టితో, దేశంలోనే అత్యంత ఆధునిక సాంకేతిక ప్రమాణాలతో కూడిన "సైబర్ సెక్యూరిటీ ఆపరేషనల్ సెంటర్ (APCSOC)" ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని ఏపీటీఎస్ ఛైర్మన్ మన్నవ మోహన కృష్ణ తెలిపారు.. దీని ద్వారా ప్రభుత్వ విభాగాలు, కీలక మౌలిక వసతులు, పౌరుల డేటాకు సమగ్ర రక్షణ కల్పిస్తూ, సైబర్ ముప్పులను ముందుగానే గుర్తించి సమర్థవంతంగా ఎదుర్కొనే విధంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామన్నారు.

మంగళవారం విజయవాడ కానూరు లోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీటీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) మరియు సైబర్ సెక్యూరిటీ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మన్నవ మోహన కృష్ణ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వినూత్న ఆలోచనతో, దేశంలోనే తొలిసారిగా వాట్సాప్ ద్వారా 1,000 కి పైగా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశామని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ తెలిపారు. మన మిత్ర డిజిటల్ పాలనలో సరికొత్త అధ్యాయం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్ మేరకు, ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా 95523 00009 నంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పంపడం ద్వారా నిమిషాల్లో సేవలు పొందవచ్చని ఆయన వివరించారు. అందుబాటులో ఉన్న ప్రధాన సేవలు డ్రైవింగ్ లైసెన్స్, వాహన రిజిస్ట్రేషన్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు, భూమి పాస్‌బుక్ వివరాలు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పెన్షన్ దరఖాస్తులు, ఆరోగ్యశ్రీ, హాల్ టికెట్లు, పరీక్షా ఫలితాలు, తిరుమల సహా ప్రముఖ ఆలయాల దర్శనం, వసతి బుకింగ్స్, ఆర్టీసీ టికెట్లు అందిస్తుందన్నారు. విద్యార్థులు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలను ఆయన సూచించారు.

పబ్లిక్ వైఫైలో బ్యాంకింగ్ లావాదేవీలు చేయడం అంత మంచిదికాదని సూచించారు. అనుమానాస్పద లోన్ యాప్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలన్నారు. వీడియో లైక్ చేస్తే డబ్బులు వస్తాయనే స్కామ్‌లను నమ్మవద్దన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో యువతను ప్రోత్సహించేందుకు ఏపీటీఎస్ ప్రతి ఏటా హ్యాకథాన్‌లు నిర్వహిస్తోందని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10,000 స్టైఫండ్ తో ఇంటర్న్ షిప్ సదుపాయం కల్పిస్తుందని ఆయన వెల్లడించారు. ఏపీటీఎస్ ప్రతినిధులు శ్రీనివాస్, దినేష్ లు సైబర్ మోసాల పై విద్యార్థులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్ సిద్ధార్థ కళాశాల వైస్ ఛాన్సలర్ డా. పి. వెంకటేశ్వరరావు, కోఆర్డినేటర్ డా. జె. శివరామ్ ప్రసాద్ లు పాల్గొన్నారు.

# నిర్దేశిత సమయంలో ప్రాజెక్టులు పూర్తి చేయాలి




విశాఖపట్నం (బిఎన్ఎస్) : వి ఎం ఆర్ డి ఎ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది విధి నిర్వహణ పట్ల అంకిత భావంతో పని చేయాలని వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ సూచించారు. ఉదయం సమావేశమందిరంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వి ఎం ఆర్ డి ఎ చైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలో అర్హులైన వారికి పదోన్నతులు ఇవ్వటం జరిగిందని, అందువల్ల ఉద్యోగులంతా తమ విధులను మరింత సమర్ధవంతంగా చేయాలని కోరారు. నిర్దేశిత గడువులోగా అన్ని ప్రాజెక్టులు పూర్తి చేయాలని, నాణ్యత లో ఎలాంటి రాజీ వద్దని ఆదేశించారు. తద్వారా సంస్థ పేరుని ఇనుమడింపచేయాలని కోరారు. ప్రధానంగా పర్యాటక ప్రాంతాల్లో అన్ని ప్రాజెక్టులు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం, రహదారులు నిర్మాణం, కార్యాలయ నిర్వహణ ఇలా అన్నింటినీ నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ మాట్లాడుతూ ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పన కి సంబంధించి సమీక్షించారు. పనుల స్థితిని తెలుసుకున్నారు. పనులను మరింత వేగవంతం చేసేందుకు ఆయా విభాగాల అధికారులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ముఖ్య ఇంజనీర్ వినయ్ కుమార్ ఎస్ ఈ లు భవాని శంకర్ మధు ఈ ఈ లు, డి ఈ లు, ఎ ఈ లు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జిల్లాలో ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి దీక్ష



మహబూబాబాద్ (బిఎన్ఎస్): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో చోటుచేసుకున్న ఈ ఘటన ఇప్పుడు స్థానికంగా కలకలం రేపుతోంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం రేకుల తండాకు చెందిన గూగులోత్ స్పందన, గూడూరు మండలం వాగ్య తండాకు చెందిన తేజావత్ రఘురాం గత ఏడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి మధ్య ఉన్న పరిచయం కాస్తా ప్రేమగా మారింది. ఏడేళ్ల పాటు చెట్టాపట్టాలేసుకుని తిరిగారు, పెళ్లి చేసుకుంటానని రఘురాం స్పందనకు మాట ఇచ్చాడు.

కానీ, తీరా పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి రఘురాం ప్లేట్ ఫిరాయించాడు. పెళ్లికి నిరాకరించడమే కాకుండా, ఆమెను దూరం పెట్టడం ప్రారంభించాడు. దీంతో మోసపోయానని గ్రహించిన స్పందన, తనకు జరిగిన అన్యాయంపై నిలదీసేందుకు నేరుగా ప్రియుడు రఘురాం నివాసం ఉండే వాగ్య తండాకు చేరుకుంది.

న్యాయం కోసం రఘురాం ఇంటి గుమ్మం ముందే స్పందన దీక్షకు దిగింది. "ఏడేళ్లు ప్రేమించి ఇప్పుడు కాదనడం ఏంటి? నన్ను పెళ్లి చేసుకునే వరకు ఇక్కడి నుండి కదిలేది లేదు" అంటూ ఆమె స్పష్టం చేస్తోంది. యువతి దీక్షతో తండాలో ఉత్కంఠ నెలకొంది. స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ప్రస్తుతం ఆ యువతి తన పట్టు వదలడం లేదు.

# మాజీ ఎండోమెంట్ అధికారి శాంతి ఇంటిపై ఏసీబీ దాడి.




రాష్ట్రంలోనే అత్యంత వివాదమైన ఎండోమెంట్ అధికారిగా పేరు తెచ్చుకున్న కలిగిరి శాంతి ఇంటి పైన ఏసీబీ అధికారులు తెల్లవారుజామున ఆకస్మికంగా దాడులు చేశారు. విజయవాడ, గుంటూరు జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారుల దాడులు కలకలం రేపుతున్నాయి. తాడేపల్లిలో నివాసం ఉంటున్న ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ కలిగిరి శాంతి ఇంటిపై ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఈరోజు ఉదయం నుంచి తాడేపల్లి లోని ఆమె నివాసానికి చేరుకున్న ఏసీబీ బృందాలు పలు కీలక పత్రాలు, ఆస్తుల వివరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆదాయానికి మించిన ఆస్తులపై అనుమానాల నేపథ్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇంట్లోని డాక్యుమెంట్లు, బ్యాంక్ లాకర్లు, ఆస్తుల వివరాలను అధికారులు సవివరంగా తనిఖీ చేస్తున్నారు. అలాగే కుటుంబ సభ్యులను కూడా అధికారులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.

# బేడీ లు వేసి బంగారం దోపిడీ




శ్రీకాకుళం (బీఎన్ ఎస్ ) : శ్రీకాకుళం జిల్లా లో వాణిజ్య కేంద్ర మైన పలాస కాశీబుగ్గ పట్టణంలో దొంగలు బరితెగించారు. వ్యాపారి కిల్లంశెట్టి రామకృష్ణ ను నిర్భందించి షాపులో బంగారం దోచుకున్నారు. సీనిపక్కిలో పోలీసులం అంటు బెదిరించి వ్యాపారినుంచి భారీ గా ఆభరణాలు దోచుకెళ్లిన సంఘటన సంచలనమైంది. . పలాస లో శ్రీ వెంకటేశ్వర జ్యూయలర్స్ లో దోపిడీ చేసిన వైనం బంగారం వ్యాపారుల గ్రూప్ లో హల్ చల్ చేస్తోంది. డిపార్ట్మెంట్ పేరుతో షాపులో చొరబడి యాజమని కిల్లంశెట్టి రామకృష్ణ ను బెడిలు వేసి దుండగలు బెదిరించి షాపు లో కేవలం బంగారం ఆభరణాలు లూటీ చేయడం క్షణాల్లోనే జరిగిపోయింది. 8 మంది యువకులు ప్రవేశించి తుపాకీ తో భయపెట్టిన దుండగలు యజమాని కి బేడీ లు వేశారు. ఆ సమయంలో ఒక్కడే ఉన్నాడు. దీంతో షాపులో ఒక్కసారిగా హడావుడి చేయడంతో యజమాని భయపడిపోయి నిస్సహాయత కు లోనయ్యారు.. పట్టపగలు పట్టణం నడి బొడ్డున జనం రాకపోకలు చేస్తుంబగానే ఈ దొంగతనం చోటుచేసుకోవడం హాటా టాపిక్ గా మారింది. వారు వెళ్లిపోయిన తర్వాత పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నా రు పోలీసులు. పలాస నిత్యానంద నగర్ లో సిని పక్కిలో జరిగిన ఈ దోపిడీ లో సుమారు కెజి బంగారం దోసుకెల్లినట్లు వ్యాపారి రామకృష్ణ చెబుతున్నారు. పోలీసులు రంగప్రవేశం తర్వాత బేడీ లను తొలగించారు. పోలీసులు రంగంలోకి గాలిస్తున్నారు క్లూస్ టీం పరిశీలిస్తోంది.

# సమ్మెకు ముగింపు..పునఃప్రారంభం కానున్న ఎన్టీఆర్ వైద్యసేవ




న్యూస్ డెస్క్, 07 ఏప్రిల్ (బిఎన్ఎస్): ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) నెట్ వర్క్ ఆస్పత్రులు వారంరోజుల క్రితం చేపట్టిన సమ్మె నేటితో ముగిసింది. పథకం కింద వైద్యం చేయగా.. వాటి బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ సమ్మెకు పిలుపునిచ్చింది. తాజాగా ప్రభుత్వం అసోసియేషన్ తో చర్చించి.. 10 రోజుల్లో రూ.1000 కోట్ల బకాయిలను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో.. సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించింది. పదిరోజుల్లోగా బకాయిలు చెల్లించని నేపథ్యంలో.. మళ్లీ ఎన్టీఆర్ వైద్య సేవల్ని నిలిపివేస్తామని ఆస్పత్రుల యాజమాన్యాలు స్పష్టం చేశారు. సమ్మె విరమణతో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద చేసే అన్నిరకాల వైద్యసేవలు పునఃప్రారంభం కానున్నాయి. కాగా.. ప్రభుత్వంతో చర్చలు జరిపిన మినిట్స్ కూడా ప్రభుత్వ అధికారులు అసోసియేషన్ కు పంపినట్లు తెలుస్తోంది. అందులో ఇచ్చిన హామీలు, చర్చల వివరాలు కూడా స్పష్టంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# కండక్టర్ చెంప పగలగొట్టిన మహిళ.

విజయవాడ (బీఎన్ఎస్) ఆధార్ కార్డు వివరాలు అడిగినందుకు ఆర్టీసీ కండక్టర్ చెంప పగలగొట్టిన సంఘటన విజయవాడ పరిధిలో జరిగింది. ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణం ఆర్టీసీ బస్సు కండక్టర్లకు ఇబ్బందికరంగా మారింది. ఏపీఎస్ఆర్టీసీ సర్వీస్ నెంబర్308విజయవాడ నుండి విస్సన్నపేటకు వెళుతున్న బస్సు అల్లూరి సీతారామరాజు స్టాప్ వద్ద ఇరువురు మహిళలు ఎక్కారు. నిబంధనల ప్రకారం ఆధార్ కార్డు గమనించి ఎక్కాను స్టేజి మరియు దిగవలసిన స్టేజి పేర్కొంటూ ఇక్కట్టు ఇవ్వాలి.

బస్సు ఎక్కిన ఇద్దర మహిళలు లో ఒక మహిళ మూడు ఆధార్ కార్డులు చూపించింది. ఆధార్ కార్డు పైన సరిగా ఫోటోలు లేకపోవడంతో బస్సు కండక్టర్ పేరు నెంబరు సరి చూసుకుంటూ, మూడో మనిషి ఎవరని ప్రశ్నించాడు.

ఆ మనిషి ముందు ఎక్కుతుంది టిక్కెట్ ఇవ్వమని మహిళ చెప్పింది. నిబంధనలకు విరుద్ధంగా అలా ఇవ్వడం కుదరదని కండక్టర్ చెప్పటంతో గొడవ పెరిగింది. మాట మాట పెరగడంతో మహిళా బస్సు కండక్టర్ చెంప పై గట్టిగా కొట్టింది.

బస్సులో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంతంతో బస్సు డ్రైవర్ సమీపంలోని నున్న పోలీస్ స్టేషన్ కు బస్సును తరలించారు.

# కళలను ఆదరించటం మన బాధ్యత



రాజమండ్రి(బిఎన్ఎస్) ఏప్రిల్ 7 :కళలను ఆదరించడం, కళాకారులను ప్రోత్యహించడం మనందరి భాధ్యత అన్నారు మంత్రి దుర్గేష్.రాజమహేంద్రవరంలోని జ్ఞాన సరస్వతి ఘాట్ వద్ద శోభిత్ వర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి దుర్గేష్, సోగ్గాడే చిన్ని నాయన డైరెక్టర్ కల్యాణ కృష్ణ, సామ్రాట్ శ్రీనివాసరాజు, కనకయ్య, రూత్విక్ రాజు, గార్డ్స్ జాతీయ కన్వీనర్ వరదా నాగేశ్వర రావు పాల్గొన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు చల్లగాలి శ్రీనివాస్ వర్మ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సభలో పలువురు కళాకారులను మంత్రి కందుల దుర్గేష్ జ్ఞాపికలతో సత్కరించారు. సమాజ సేవలోను, కళా రంగంలోనూ రాణిస్తున్న పలువురు ప్రతిభావంతులకు 'సేవా పురస్కారాలను' అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మంత్రి దుర్గేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కళలను ఆదరించడం, కళాకారులను ప్రోత్సహించడం మనందరి బాధ్యతని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ కొనియాడారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం కోసం కృషి చేస్తున్న శ్రీమతి ఆకుల విజయభారతి, విద్యారంగంలో పేదల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న మెరుగుమళ్ళ బ్యూలారత్నం, శ్రీమునీష్ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో సత్తిరాజు, డి ఎస్ పి రావు, కృష్ణమాచార్యలు, కె. రాధికా స్థానిక నాయకులు, ట్రస్ట్ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు మరియు కళాకారులు పాల్గొన్నారు.

# న్యాయ పరిజ్ఞానమే మహిళలకు అసలైన ఆయుధం - DSNLU సదస్సులో నిపుణుల వెల్లడి



విశాఖపట్నం (బీఎన్ఎస్) : పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కార) చట్టం, 2013 (పోష్ చట్టం) పై దక్షిణ ప్రాంతీయ న్యాయ సమీక్ష సంప్రదింపులను, జాతీయ మహిళా కమిషన్ సహకారంతోదామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, న్యూఢిల్లీలోని కేంద్ర సమాచార కమిషన్ సమాచార కమిషనర్ సుధా రాణి రేలంగి హాజరయ్యారు. ఈ సంప్రదింపులలో జాతీయ మహిళా కమిషన్ సభ్యులు, విశాఖపట్నం బార్‌కు చెందిన ప్రముఖ న్యాయవాదులు మరియు జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాల అధ్యాపక బృందంలోని విషయ నిపుణులు పాల్గొన్నారు. ప్రారంభోపన్యాసంలో వైస్ ఛాన్సలర్ ప్రో సూర్య ప్రకాశ రావు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుండి ఆధునిక కాలం వరకు మహిళల స్థానాన్ని మరియు పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిష్కార) చట్టం, 2013ను రూపొందించడం వెనుక ఉన్న విషయాన్ని వివరించారు.

ముఖ్య అతిథి సుధా రాణి రెలాంగి మాట్లాడుతూ, "మన చదువే మనకు శక్తి అని, అందులోనూ న్యాయ పరిజ్ఞానం కూడిన చదువు మరింత శక్తివంతమైనది" అని పేర్కొన్నారు. ఎందుకంటే, న్యాయ పరిజ్ఞానం ఉండటం వల్ల లైంగిక వేధింపుల ఘటనలను నివారించవచ్చని, అలాగే కార్యాలయంలోని ప్రతికూల పరిస్థితులను ఎదుర్కోవచ్చని ఆమె అన్నారు. ప్రతి మహిళ తన కోసం తాను బలంగా నిలబడేలా, సమాజంలో చైతన్యవంతంగా ఉండేలా సాధికారత కల్పించడం యొక్క ప్రాముఖ్యతను ఆమె నొక్కి చెప్పారు.

ఆమె పోష్ చట్టం చట్టం గురించి మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్ (CEDAW) వంటి అంతర్జాతీయ చట్టాలలో దాని మూలాలు ఎలా ఉన్నాయో, మరియు కాలక్రమేణా అది ఎలా పరిణామం చెందిందో చర్చించారు. ఆమె లైంగిక వేధింపుల నిర్వచనం మరియు భారతదేశంలో దాని వాస్తవ పరిస్థితిపై అందరి దృష్టిని ఆకర్షించారు. కార్యాలయంలో మహిళల పట్ల అనుచితమైన లేదా దురుద్దేశపూరిత వ్యాఖ్యలు వారి గౌరవం మరియు మానసిక శ్రేయస్సుపై ఎంత తీవ్రంగా ప్రభావం చూపుతాయో ఆమె వివరించారు.

ఈ చట్టం లైంగిక వేధింపుల నివారణ, నిషేధం మరియు పరిష్కారం అనే మూడు కీలక అంశాలపై దృష్టి సారిస్తుందని ఆమె మరింతగా వివరించారు. అదనంగా, ఈ చట్టం తప్పుడు ఫిర్యాదులను కూడా పరిష్కరిస్తుందని, మరియు క్రమశిక్షణా యంత్రాంగాల ద్వారా పురుషులతో సహా వ్యక్తులను దుర్వినియోగం నుండి రక్షించడానికి నిబంధనలను కలిగి ఉందని ఆమె పేర్కొన్నారు. చివరిలో మారుతున్న సామాజిక కట్టుబాట్లు మరియు పని వాతావరణాలకు అనుగుణంగా లైంగిక వేధింపుల నిర్వచనాన్ని విస్తరించాలని మామ్ సిఫార్సు చేశారు. ఆమె లింగ-తటస్థ చట్టాల ఆవశ్యకతను కూడా నొక్కిచెప్పారు మరియు వేధింపుల పట్ల ఏమాత్రం సహనం ఉండకూడదని ఉద్ఘాటించారు. ప్రతి వ్యక్తి (స్త్రీ, పురుషులు) చట్టాన్ని గౌరవించాలని మరియు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని సృష్టించడానికి దోహదపడాలని చట్టబద్ధంగా ఆశించేలా చేయడమే విద్య యొక్క ఉద్దేశ్యమని పేర్కొంటూ ఆమె ముగించారు.

ఈ సంప్రదింపుల కార్యక్రమము లో రెండు సెషన్స్ గా ఈ యొక్క సంప్రదింపులు నిర్వహించారు. మొదట సెషన్ లో PoSH చట్టం, 2023 క్రింద ముఖ్యమైన నిబంధనలు మరియు సంస్థాగత యంత్రాంగాలు మరియు ఎండ సెషన్ లో విధానపరమైన రక్షణల అమలు సవాళ్లు మరియు కొత్తగా తలెత్తుతున్న సమస్యలు అనే అంశాలమీద సంప్రదింపులు నిర్వహించారు. సంప్రదింపుల కార్యక్రక్రమము లో ముఖ్య అతిథితో పాటు, జాతీయ విమెన్ కమిషన్ మెంబెర్ పల్లవ్ పాల్, ప్రొఫెసర్ వి. రాజ్యలక్ష్మి, ఏయూ, ప్రొఫెసర్ ఆర్. అనితా రావు, ప్రొఫెసర్ ఎన్. చంద్రకళ, ఏయూ, మరియు డాక్టర్ రిఫత్ ఖాన్, డీఎస్ఎన్ఎల్యూ తొలి సమావేశ సంప్రదింపులలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమము లో రెండు సెషన్స్ గా ఈ యొక్క సంప్రదింపులు నిర్వహించారు. మొదట సెషన్ లో PoSH చట్టం, 2023 క్రింద ముఖ్యమైన నిబంధనలు మరియు సంస్థాగత యంత్రాంగాలు మరియు ఎండ సెషన్ లో విధానపరమైన రక్షణల అమలు సవాళ్లు మరియు కొత్తగా తలెత్తుతున్న సమస్యలు అనే అంశాలమీద సంప్రదింపులు నిర్వహించారు

# ఆటిజంకు హోమియోలో అద్భుత పరిష్కారం



విజయవాడ (బిఎన్ఎస్): చిన్నారుల ఎదుగుదలలో శాపంగా మారిన ఆటిజం మహమ్మారికి హోమియోపతి వైద్యంతో శాశ్వత పరిష్కారం చూపవచ్చని ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ నిరంజన్ వెల్లడించారు. మేనరికం వల్ల తలెత్తే జన్యుపరమైన లోపాలు, ఆటిజం వంటి సంక్లిష్ట సమస్యలను కూడా హోమియో మందులతో నయం చేయవచ్చని ఆయన నిరూపించారు. విజయవాడలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆటిజం నుండి కోలుకున్న ఒక చిన్నారి ఉదంతాన్ని ఆయన స్వయంగా వివరించారు.

నిరాశ నుండి నిరీక్షణ దాకా..

కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన ఒక ఉపాధ్యాయుడు మేనరికం వివాహం చేసుకున్నారు. వారికి జన్మించిన తేజస్విని (9) పుట్టినప్పటి నుండి ఆటిజం లక్షణాలతో బాధపడేది. నార్మల్ డెలివరీ అయినప్పటికీ, పాప ఎదుగుదలలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. పాప సమస్యను గుర్తించిన తండ్రి, ఐదు సంవత్సరాల పాటు ప్రముఖ చైల్డ్ న్యూరాలజిస్టుల వద్ద చికిత్స చేయించారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా ఫలితం దక్కలేదు. పాపకు తరచూ ఫిట్స్ రావడం, జలుబు, జ్వరం వంటి సమస్యలు వేధించేవి. శారీరక ఇబ్బందులతో పాటు మానసిక ఎదుగుదల కూడా లోపించింది. పాప ప్రవర్తన చూసి ఇరుగుపొరుగు వారు తమ ఇళ్లకు రానిచ్చేవారు కాదని, ఎన్నో అవమానాలు భరిస్తూ చిన్నారిని కాపాడుకుంటూ వచ్చామని తండ్రి కన్నీటి పర్యంతమయ్యారు.

హోమియోతో పునర్జన్మ

పాప పరిస్థితిపై నిరాశలో ఉన్న సమయంలో, స్నేహితుడు కొక్కిలిగడ్డ నాంచారయ్య సూచన మేరకు విజయవాడలోని క్యూర్ హోమియో డాక్టర్ నిరంజన్ గారిని సంప్రదించారు. డాక్టర్ నిరంజన్ పర్యవేక్షణలో హోమియో మందులు వాడటం ప్రారంభించిన కొద్ది కాలంలోనే పాపలో ఆశ్చర్యకరమైన మార్పులు వచ్చాయి. ప్రస్తుతం తేజస్విని ఆటిజం నుండి పూర్తిగా బయటపడి సాధారణ బాలికలా మారిపోయింది. క్రమం తప్పకుండా స్కూలుకు వెళ్తోంది. పాప ఇప్పుడు సొంతంగా బొమ్మలు గీస్తోంది. తనకు ఇష్టమైన సినిమాలు, పాటలు, కథలు కూడా అనర్గళంగా చెబుతోందని తండ్రి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తల్లిదండ్రులు ధైర్యంగా ఉండాలి: డాక్టర్ నిరంజన్ పిలుపు

ఈ సందర్భంగా డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ, హోమియోపతి వైద్యం అద్భుతాలు చేస్తుందని భరోసా ఇచ్చారు. మేనరికపు లోపాలకు చెక్: మేనరికం వల్ల వచ్చే జన్యుపరమైన వ్యాధులకు హోమియోలో అద్భుతమైన మందులు ఉన్నాయని ఆయన తెలిపారు. ఆటిజం పిల్లల తల్లిదండ్రులు మానసిక శోభకు గురికావద్దని, ధైర్యంగా హోమియో చికిత్స తీసుకుంటే పిల్లలను సాధారణ స్థితికి తీసుకురావచ్చని సూచించారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్ లు లేకుండా, కేవలం మందులతోనే మెదడు పనితీరును మెరుగుపరచవచ్చని ఆయన నిరూపించారు.

లక్షలాది రూపాయలు ఖర్చు చేసినా నయం కాని ఆటిజం, కేవలం హోమియో మందులతో నయం అవుతుందని డాక్టర్ నిరంజన్ వివరించారు.

# జిల్లాలో ధాన్యం సేకరణపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి

## ఆకస్మిక తనిఖీలతో ధాన్యం కొనుగోలు ప్రక్రియను నేరుగా పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్ల క్షేత్రస్థాయిలో రైతులతో మట్లాడుతూ సమస్యల పరిష్కారం

నెల్లూరు జిల్లా కలక్టరేట్(బి.యన్.యస్):-నెల్లూరు జిల్లా ఖరీఫ్, రబీ సీజన్లలో ఇప్పటిదాకా జిల్లాలో మొత్తం 1,04,245 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ ప్రతి రోజు టెలి కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను అప్రమత్తం చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని అన్నదాతలకు కలెక్టర్ భరోస.నెల్లూరు జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల క్షేత్రస్థాయిలో తన పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేశారు. రైతులకు గిట్టుబాటు ధర అందేలా, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల పనితీరును స్వయంగా పరిశీలిస్తున్నారు.

ఇటీవల టి.పి. గూడూరు మండలం వరిగొండతో పాటు విడవలూరు మండలం పార్లపల్లి ప్రాంతాల్లో కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ధాన్యం సేకరణ పరిస్థితులను సమీక్షించారు. ఈ ఆకస్మిక తనిఖీలతో అధికారులు అప్రమత్తమవుతుండగా, కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెరుగుతోంది.

తోటపల్లి గూడూరు మండలం వరిగొండలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడి రికార్డులు, నమోదు విధానం, ధాన్యం స్వీకరణ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బందిని కొనుగోలు విధానం, రైతులకు అందుతున్న సదుపాయాలు, చెల్లింపుల వ్యవస్థపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రోడ్డుపై నిలిపి ఉంచిన రైతుల ధాన్యంతో కూడిన ట్రాక్టర్లను పరిశీలించిన ఆయన, ట్రక్ షీట్, నమోదు విధానం, ట్రాకింగ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

అలాగే విడవలూరు మండలం పార్లపల్లి వద్ద రోడ్డుపై ధాన్యాన్ని ఉంచిన రైతులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. ధాన్యం సేకరణ వివరాలను తెలుసుకుని, రైతులకు ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

2025-26 ఖరీఫ్, రబీ సీజన్లలో ఇప్పటిదాకా జిల్లాలో మొత్తం 1,04,245 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 6,603 మంది రైతుల వద్ద నుండి సేకరించారు. ఈ ధాన్యపు మొత్తం విలువ సుమారు రూ.249 కోట్లు కాగా, అందులో 5,678 మంది రైతులకు రూ.211 కోట్లు 24 గంటల లోపు చెల్లింపులు చేయడం జరిగింది.

ధాన్యం నాణ్యతపై కూడా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం కొలిచే యంత్రాలను స్వయంగా పరిశీలిస్తూ, ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు జరుగుతున్నదా అన్నది



నిర్ధారిస్తున్నారు.

ధాన్యం సేకరణ, కొనుగోలు పై కలెక్టర్ ప్రతిరోజు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. రైతులు ఎక్కడా నష్టపోకుండా ఎప్పటికప్పుడు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ధాన్యం రవాణా, గోనె సంచుల సరఫరా, మిల్లులకు తరలింపు వంటి అంశాలపై కూడా కలెక్టర్ ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. రైతుల ధాన్యం ఆలస్యం కాకుండా వేగంగా కొనుగోలు చేసి, చెల్లింపులు సమయానికి జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

జిల్లాలో ధాన్యం సేకరణను సమర్థవంతంగా నిర్వహించి రైతుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా కలెక్టర్ చర్యలు కొనసాగుతున్నాయి. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజకు ప్రభుత్వం భరోసాగా ఉంటుందని కలెక్టర్ అన్నదాతలకు అండగా నిలిచేలా ధాన్యం సేకరణ ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

# ఇన్నోవేషన్ పంచాయత్...



నూతన ఆవిష్కరణలు, అంకురాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ నెల 11వ తేదీన నల్లగొండలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ 'ఇన్నోవేషన్ పంచాయత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా కలెక్టరేట్ లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల తో జరిగిన సమావేశంలో ఇన్నోవేషన్ పంచాయత్ పై రూపొందించిన గోడ పత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ఈనెల 11న నల్గొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్స్ లో తెలంగాణ ఇన్నోవేషన్స్ ఆధ్వర్యంలో "ఇన్నోవేషన్ పంచాయత్" ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల నుండి ఆవిష్కర్తలను, వ్యవస్థాపకులను ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, ఆవిష్కర్తలకు, వారికి అవసరమైన తోడ్పాటుకు మధ్య ఉన్న భౌగోళిక దూరాన్ని తగ్గించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన వేదికగా ఇన్నోవేషన్ పంచాయత్ ను రూపొందించారని,

అన్నారు.. యువత తమ ఆలోచనలు, ఆవిష్కరణ తో పాటు పారిశ్రామిక ప్రయాణం పై సందేహాలకు నిపుణుల ద్వారా సలహాలు పొందవచ్చని, ఇది ఒక గొప్ప అవకాశంగా భావించి యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 104 సంచార వైద్యశాల ద్వారా మరింత మెరుగైన వైద్యం అందిస్తాం...!!




ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి ఒక్కరికి సంచార వైద్యం ద్వారా మరింత మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్ అన్నారు. మంగళగిరిలోని ఎపిఐఐసి టవర్స్ లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సౌరబ్ గౌర్ కీలకమైన ఆదేశాలను జారీ చేశారు.అత్యవసర సమయాల్లో అందించే గుండెకు ప్రాథమిక చికిత్సను కూడా,వైద్య వాహనాలకు మందులు, సర్జికల్స్ సరఫరా వ్యవస్థను మరింత పటిష్టపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇ-ఔషధి ద్వారా తప్పనిసరిగా నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని.

ఈ వాహనాల్లో గ్రామాలకు వెళ్లి రోగులకు మందులు పంపిణీ చేస్తారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్స్ నుంచి మందులు, సర్జికల్స్ సరఫరాకు సంబంధించిన స్టాకు వివరాల్ని ఇ-ఔషధి పోర్టల్ లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు.

మారుమూల పల్లె ప్రాంతాలకు మెరుగైన వైద్యం అందించాలని దృక్పథంతో డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఐటీ విభాగం నిర్వహించింది. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొందిన మాస్టర్ ట్రైనర్లు 104 సంచార వైద్య వాహనాల డేటా ఎంట్రీ ఆపరేటర్లకు జిల్లాల్లో శిక్షణ ఇస్తారని సి-డాక్ సీనియర్ ప్రాజెక్ట్ ఇంజనీర్ పసుపులేటి అశ్విని తెలిపారు. 104 సంచార వైద్య వాహనాల విభాగంలో పనిచేసే జిల్లా, రీజినల్ మేనేజర్లు, ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌లు 55 మందికి రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చామని ఆమె తెలిపారు. ఆన్‌లైన్‌లో స్టాకు వివరాలు అందుబాటులో ఉండడం వల్ల మందులు, సర్జికల్స్ ఎప్పటికప్పుడు చెక్ చేసుకునేందుకు వీలుంటుందని, అవసరాల మేరకు సరఫరా చేసేందుకు వీలు కలుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఏడాది క్రితం నుంచే హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఆన్‌లైన్ స్టాకు నమోదును అమలు జరుగుతోందని తెలిపారు.

ఏపీ ప్రభుత్వం, ఆదేశాలతో 104 వాహనాల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేసేందుకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని అన్నారు.

# మే 4 వరకు కొనుగోలు చేయండి...!!



అమరావతి బిఎన్ఎస్ (ఏప్రిల్ 7 ): రాష్ట్రంలో కందుల కొనుగోలు గడువు మే 4 వరకు పొడిగించడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి కందులు (రెడ్ గ్రామ్/తూర్) కొనుగోలు గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయం అని అన్నారు. రాష్ట్రంలో ధర మద్దతు పథకం కింద కొనుగోలు కొనసాగుతుందని మంత్రి తెలిపారు. కొనుగోలు గడువును పొడిగించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, మే 4 వరకు పొడిగింపునకు ఆమోదం తెలిపిందన్నారు. రైతులు తమ పంటను నష్టపోకుండా విక్రయించుకునేలా చూడటం కూటమి ప్రభుత్వ బాధ్యత. రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందేలా ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారు అని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం వెంటనే స్పందిస్తోంది. పంటల కొనుగోలు, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటి అన్ని అంశాల్లో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు కొనసాగిస్తామని అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# బాలల భద్రతపై అలర్ట్: అంబాజీపేట స్కూల్‌పై కమిషన్ తీవ్ర స్పందన



అంబాజీపేట..(బిఎన్ఎస్)ఏప్రిల్. 7.అంబాజీపేటలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు డా. నాగ మానస , పాఠశాలలో ఇటీవల చోటుచేసుకున్న సంఘటనపై సంబంధిత అధికారులు, సిబ్బంది నుండి సమగ్ర వివరాలు సేకరించారు.

విద్యార్థుల భద్రత, పాఠశాల మౌలిక వసతులు, పర్యవేక్షణ వ్యవస్థలో ఉన్న లోపాలను క్షుణ్ణంగా పరిశీలించిన డా. నాగ మానస , బాధ్యుల నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. బాలల హక్కుల ఉల్లంఘనకు సంబంధించిన అంశాలపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని స్పష్టంగా హెచ్చరిస్తూ, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణమే సరిదిద్దు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సంఘటన వివరాల ప్రకారం, అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి సిహెచ్ . మణికంఠను పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా జెండాలు పాతే పనిలో పాల్గొనాల్సిందిగా చేయడంతో, గుణపం తగిలి అతని మధ్యవేలు తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన పాఠశాల స్థాయిలో బాలల భద్రతపై ఉన్న ఘోర నిర్లక్ష్యాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందని కమిషన్ సభ్యురాలు పేర్కొన్నారు.

పరిశీలన సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో వంటశాల పరిసరాలు, టాయిలెట్లు, తరగతి గదుల్లో అవసరమైన పరిశుభ్రత ప్రమాణాలు పాటించబడకపోవడాన్ని డా. నాగ మానస గుర్తించారు. ఈ పరిస్థితులు విద్యార్థుల ఆరోగ్యానికి తీవ్రమైన ప్రమాదంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, మౌలిక సదుపాయాల నిర్వహణలో పాఠశాల యాజమాన్యం పూర్తిగా విఫలమైందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

బాలలను శారీరక ప్రమాదాలకు గురిచేసే విధంగా పనులు చేయించడం చట్ట విరుద్ధమని, దీనిపై బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని కమిషన్ స్పష్టం చేసింది. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా పాఠశాలలు పనిచేయాలని, నిర్లక్ష్యానికి ఇకపై ఎలాంటి సడలింపులు ఉండవని డా. నాగ మానస కఠిన హెచ్చరిక జారీ చేశారు.

# సినిమా న్యూస్

## 'జైలర్ 2'లో నలుగురు సూపర్ స్టార్స్



సినిమా ఇండస్ట్రీలో అప్పుడప్పుడే కనిపించే అద్భుత కాంబినేషన్లలో ఒకటిగా 'జైలర్ 2' నిలవబోతోంది. ఒకే సినిమాలో నలుగురు సూపర్ స్టార్స్ కలిసి నటించబోతున్నారన్న వార్త సినీ వర్గాల్లో భారీ చర్చకు దారితీస్తోంది. దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం, ఇప్పటికే ఘన విజయాన్ని అందుకున్న జైలర్‌కి సీక్వెల్‌గా రూపొందుతోంది. మొదటి భాగంలో రజనీకాంత్ నటనతో పాటు శివ రాజ్ కుమార్ ప్రత్యేక పాత్ర సినిమాకు అదనపు హైప్ తెచ్చింది. ఈ సీక్వెల్‌లో రజనీకాంత్‌తో పాటు మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ , బాలీవుడ్ స్టార్ షారూఖ్ ఖాన్ , కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కలిసి కనిపించనున్నట్లు సమాచారం. ఈ స్థాయి కాంబినేషన్ ఒకే సినిమాలో రావడం చాలా అరుదు.

ప్రస్తుతం హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ జోరుగా సాగుతోంది. ముఖ్యంగా షారుఖ్ ఖాన్ ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నారని, ఆయనకు సంబంధించిన కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికే మోహన్‌లాల్‌పై కూడా కీలక సీన్స్ పూర్తి చేశారు. 'జైలర్ 2'ను హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నారు. నలుగురు సూపర్ స్టార్స్ ఉండటంతో భారీ యాక్షన్ సన్నివేశాలు, మాస్ ఎలిమెంట్స్ ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని అందించనున్నాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని అనిరుధ్ రవిచందర్ అందిస్తున్నారు. సన్ పిక్చర్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది.

'జైలర్' విజయంతో ఈ సీక్వెల్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. నలుగురు స్టార్ హీరోలు కలిసి నటించడంతో ఓపెనింగ్స్ రికార్డ్ స్థాయిలో ఉండే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సినిమాను 2026 ఆగస్టులో విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ మెగా మల్టీస్టారర్‌తో మరోసారి రజనీకాంత్ బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తారనే నమ్మకం అభిమానుల్లో కనిపిస్తోంది. , 'జైలర్ 2' కేవలం సినిమా మాత్రమే కాదు... ఇండియన్ సినిమాకు మరో కొత్త స్థాయి తీసుకెళ్లే ప్రాజెక్ట్‌గా నిలవనుంది.

## ఇప్పుడున్న జనరేషన్‌కు ఆయనే రోల్ మోడల్





ప్రస్తుతం సౌత్ ఇండియాలో మోస్ట్ బిజీ హీరోయిన్లలో ఐశ్వర్య రాజేష్ ఒకరు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ఈ అమ్మడు తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఇటీవల వెంకటేష్ సరసన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ హిట్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు ఫుల్ ఫామ్‌లో ఉంది. ప్రస్తుతం తీరువీర్‌తో కలిసి 'ఓ సుకుమారి' అనే సినిమాలో నటిస్తూనే, చేతినిండా మరిన్ని ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. ఈ క్రమంలో.. తాజాగా, తమిళ స్టార్ హీరో తళపతి విజయ్ గురించి ఐశ్వర్య చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. విజయ్ గురించి ఆమె మాట్లాడుతూ.. "విజయ్ సార్ ఎప్పుడూ ఎవరి గురించి తప్పుగా మాట్లాడరు. తన పని తాను చేసుకుంటూ వెళ్తుంటారు. కానీ బయట చాలామంది ఆయన గురించి నెగటివ్‌గా మాట్లాడుతుంటారు, విమర్శలు చేస్తుంటారు. అయినా సరే, ఆయన అవేమీ పట్టించుకోరు. తన పని మీద మాత్రమే దృష్టి పెడతారు" అని చెప్పుకొచ్చింది. విజయ్‌కి తన ఫ్యాన్స్ అంటే ఎంత ఇష్టమో ఐశ్వర్య వివరించింది. "ఆయనకు తన అభిమానులే ప్రపంచం. వారికి ఏది కావాలో, వారిని ఎలా సంతోషపెట్టాలో ఆయనకు బాగా తెలుసు. అందుకే ఎంతమంది ఎన్ని మాటలన్నా అవన్నీ భరిస్తూ ముందుకు సాగుతారు. నిజంగా ఈ కాలం యువతకు ఆయన ఒక గొప్ప రోల్ మోడల్" అని ఐశ్వర్య కొనియాడింది. విజయ్ ప్రస్తుతం రాజకీయాల్లోకి కూడా ఎంట్రీ ఇవ్వడంతో, ఐశ్వర్య చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఒక స్టార్ హీరో అయి ఉండి, విమర్శలను పట్టించుకోకుండా తన లక్ష్యం వైపు సాగిపోవడం అందరికీ స్ఫూర్తినిస్తుందని ఆమె అభిప్రాయపడింది. ఐశ్వర్య రాజేష్ చేసిన ఈ వ్యాఖ్యలను విజయ్ అభిమానులు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ చేస్తున్నారు.

## ఇకపై ఒంటరిగానే



ఒకప్పుడు తనను ఐరెన్ లెగ్ అని వెక్కిరించిన నోళ్లతోనే.. తన టాలెంట్‌తో స్టార్ హీరోయిన్ అని అనిపించుకున్న భామ శృతి హాసన్. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ తనను విమర్శిస్తున్న వారికి తనదైన స్టైల్‌లో కౌంటర్లు ఇస్తూ వార్తల్లో నిలుస్తున్న శృతి, తాజాగా తన పర్సనల్ లైఫ్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీని షేక్ చేస్తున్నాయి. ముఖ్యంగా తన ప్రేమ, బ్రేకప్స్ గురించి ఆమె ఓపెన్‌గా మాట్లాడటం నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా హీరోయిన్లు తమ రిలేషన్ షిప్స్ గురించి దాస్తుంటారు, కానీ శృతి మాత్రం ఓపెన్ అయి తన మనసులోని ఆవేదనను బయటపెట్టింది. "నా జీవితంలో ఇప్పటివరకు నేను ఆరుసార్లు ప్రేమలో పడ్డాను. కానీ ఆ ప్రతిసారీ నాకు మిగిలింది కేవలం గాయాలే. అందుకే ఇకపై ప్రేమ అనే పేరు ఎత్తకూడదని నిర్ణయించుకున్నాను.

ప్రస్తుతం నాకు ప్రశాంతత ముఖ్యం, అందుకే ఒంటరిగా ఉండాలని ఫిక్స్ అయ్యాను" అంటూ షాకింగ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. ఈ మాటలు విన్న ఆమె అభిమానులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఆరు సార్లు మనసు ముక్కలవ్వడంతోనే ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. పర్సనల్ లైఫ్‌లో ఎన్ని ఒడిదుడుకులు ఉన్నా, కెరీర్ విషయంలో మాత్రం శృతి ఫుల్ ఫామ్‌లో ఉంది. ప్రస్తుతం మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ సరసన 'ఆకాశంలో ఒక తార' అనే సినిమాలో నటిస్తోంది. పవన్ సాదినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్టును గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా వంటి టాప్ బ్యానర్స్ సమర్పిస్తున్నాయి. శృతి నటనతో పాటు ఈ మూవీలో ఆమె పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతుందని సమాచారం.

## త్రిష సినిమాలకు గుడ్ బై..!!

స్టార్ హీరోయిన్ త్రిష సినిమాలకు గుడ్ బై చెప్పనున్నట్లు గత కొద్ది రోజులుగా వార్తలు వస్తుండగా.. దీనిపై తాజాగా నటుడు, దర్శకుడు చిత్ర లక్ష్మణన్ షాకింగ్ కామెంట్స్ చేశాడు. సోషల్ మీడియాలో అకౌంట్ యూట్యూబ్ వేదికగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. 'త్రిష సినిమాలకు గుడ్ బై చెప్పనున్నారంటూ గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఈ విషయమై తెలిసిన నిర్మాతలను సంప్రదించగా.. ఇకపై ఆమె సినిమాల్లో కొనసాగాలని అనుకోవడం లేదని, వచ్చిన అవకాశాలు సైతం తిరస్కరిస్తున్నారు అని వారు తెలిపారు' అని ఆయన చెప్పుకొచ్చాడు. ప్రజెంట్ ఈ కామెంట్స్ నెట్టింట హాట్ టాపిక్‌గా మారడంతో.. ఫుల్ క్లారిటీ ఉంటేనే చిత్ర లక్ష్మణన్ ఇలాంటి కామెంట్స్ చేస్తారని.. కాబట్టి త్రిష సినిమాలకు గుడ్ బై చెప్పడం వాస్తవమే అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు నెటిజన్లు. అయితే.. దీనిపై ఇప్పటి వరకు త్రిష టీమ్ నుంచి ఎలాంటి స్పందనైతే రాలేదు. మరి ఇందులో నిజం ఎంత ఉందో తెలియాల్సి ఉంది.

